క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతల నుంచి భక్తులు తరలివచ్చారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్ర పర్వంగా నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

గ్రావెల్ తరలిస్తున్న యంత్రాలు సీజ్


అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన యంత్రాలు

సబ్బవరం: కొన్నిరోజులుగా గంగవరం,నంగినారపాడు గ్రామాల్లోని జగనన్న కాలనీల లేఅవుట్‌లలో అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్న అక్రమార్కుల యంత్రాలను సోమవారం రెవెన్యూ,మైనింగ్ అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నారు.మైనింగ్ లాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి, వీఆర్వో వెంకటేష్ పట్టపగలే గ్రావెల్ తవ్వుతుండగా పొక్లెయిన్‌తో పాటు లారీని పట్టుకొని సీజ్ చేశారు.పట్టుబడిన యంత్రాలను సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపిక


ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: కర్నూలు జిల్లాలో రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన 5 విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కోచ్ జి.హరినాథ్‌రెడ్డి చెప్పారు. గత నెలలో అనకాపల్లిలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించిన సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన జి.ధార్మిక శివాని వ్రత, ఆర్.తేజ, టి.ఎస్.రణధీర్, ఎం.కార్తీక్, ఎల్.హిమప్రభాస్ రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ విద్యార్థులను పాఠశాల సీఈవో నిశాంత్, ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కోచ్ హరినాథ్‌రెడ్డి అభినందించారు.

రావాడలో ప్రొటోకాల్ ఉల్లంఘన

పరవాడ: రావాడ గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారు. గ్రామసభలో డయాస్ పైకి సర్పంచ్‌తో పాటు స్థానిక ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావును ఆహ్వానించలేదు. గ్రామ పంచాయతీలో అనేక గ్రామ సభలు నిర్వహించిన అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడం సమంజసం కాదని ఆరోపించారు.

రాజన్నా.. నీ స్మృతిలో..

- వేడుకగా వైఎస్సార్ జయంతి
- వాడవాడలా మహానేతకు ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పెందుర్తి నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.


పెందుర్తిలో కేక్ కట్ చేస్తున్న దాడి ఉమామహేష్, నాయకులు


సుజాతనగర్‌లో నివాళులర్పిస్తున్న మెంటి మహేష్, నాయకులు


వేపగుంట కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: వేపగుంట కూడలిలో మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత వైఎస్సార్‌దే అన్నారు. వైఎస్సార్ మరణానంతరం రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి ప్రజలకు దేశానికే ఆదర్శంగా నిలిచేలా సంక్షేమ పాలన అందించారన్నారు. దురదృష్టవశాత్తు ఎన్నికల్లో ఓటమి చెందామన్నారు. అయినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నిరంతరం ప్రజల గొంతుకై గళం విప్పుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గండి రవికుమార్, ఉప్పిలి కనకరాజు, ఆదిరెడ్డి మురళి, జోబ్‌దాస్(చిన్ని), మధుపాడ అంజి, మెంటి మహేష్, దాడి ఉమామహేష్, వరంబాబు, రామరాజు, దాసరి సత్తిబాబు, బల్ల రాంబాబు, రాపర్తి మాధవరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 96వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాడి ఉమామహేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. నాయకులు అప్పాజీరావు, కొణతాల దేవరాజు, ఏవీ రమణ, జయరాంరెడ్డి, శరగడం గణేష్, పి.వేణు, పెతకంశెట్టి ఈశ్వరరావు, శ్రీను, అప్పారావు, శంకర్, గొర్లె రాము, రఘు, అల్లం అప్పారావు, ఆది పాల్గొన్నారు.
- 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరవాడ మండలంలో..

పరవాడ: పరవాడ గ్రామంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మహానేత విగ్రహం వద్ద అంజలి ఘటించారు. మహానేత ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, నాయకులు చల్లా కనకారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

- ఈ.బోనంగి దరి గౌతులచ్చన్ననగర్ కూడలిలోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొడ్డపు చిన్నారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొర్లి గోపి, బొడ్డపు అప్పారావు, ఎం.చిన్న ఈశ్వరరావు, కె.శేషసురేష్, కె.భాస్కరరావు, బొండా శ్రీను, సీహెచ్.రాజబాబు, బొడ్డపు అప్పలరాజు పాల్గొన్నారు.
- దేశపాత్రునిపాలెంలో పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, పలువురు పార్టీ నేతలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అడవివరంలో..

సింహాచలం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం అడవివరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. 98వవార్డు యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు, ప్రజలకు పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు బోర కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, మధు రెడ్డి, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, నడింపల్లి రామరాజు, టి.రాము, బొట్టా శ్రీను, లండ భాస్కర్, ఆకుల నాగరాజు, మజ్జి అప్పలరమణ, ఆర్.వర్మ, ఎస్.అప్పారావు, బోర ప్రసాద్‌రెడ్డి, కె.సింహాద్రి, సిరిపురపు కృష్ణ,శిడగం తాతబాబు, బోర లక్ష్మణరెడ్డి, అక్కిరెడ్డి శ్రీను,వైడీపీ ప్రసాద్, రాంభుక్త ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పరవాడలో వైఎస్సార్ కాంస్య విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు


గౌతులచ్చన్ననగర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పార్టీ నాయకులు

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: స్థానిక మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు ఆయన చేతులమీదగా తినిపించారు. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. రోగులకు పండ్లు,పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, కొటాన రాము,బోకం రామునాయుడు,వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్,సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు, సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబు, పల్ల కృష్ణ,మోపాడ అప్పారావు, యడ్ల నాయుడు,వద్దాది అప్పలరాజు, మామిడి కొండాజీ,గవర అప్పారావు,బండారు శ్రీను,మళ్ల కోటేశ్వరరావు,సబ్బవరపు నాగభూషణం,గవర రాజు,పెచ్చేటి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

- ఆరిపాకలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ పార్టీ శ్రేణులతో కలిసి మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- అసకపల్లిలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అడవివరంలో ప్రజలకు పులిహోర అందజేస్తున్న కొలుసు ఈశ్వరరావు తదితరులు


సబ్బవరం పీహెచ్‌సీలో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు


సబ్బవరంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్


ఆరిపాకలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సురేష్ రాజ్ తదితరులు


అసకపల్లిలో నివాళులర్పిస్తున్న కాపుశెట్టి శేషుబాబు తదితరులు

నిర్దేశించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు


రాణార్ సూపర్ పాస్ఫెట్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు


సబ్బవరంలో ఎరువులు,విత్తనాల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ,విజిలెన్స్ అధికారులు

ఏడీఏ సీహెచ్.కె.చౌదరి

సబ్బవరం: నిబంధనల మేరకే ప్రైవేటు డీలర్లు ఎరువులు,విత్తనాలు,పురుగులు విక్రయించాలని రంపచోడవరం ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి ఆదేశించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ,విజిలెన్స్ డిపార్టుమెంట్ సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా సబ్బవరంలోని పురుగుల మందులు,విత్తనాల షాపులను ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రైవేటు డీలర్లు ద్వారా కూడా ప్రభుత్వం యూరియా తదితర ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు రైతులకు విక్రయించినా,నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్. రవి ప్రసాద్,స్థానిక మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ,జిల్లా క్వాలిటీ కంట్రోల్ వ్యవసాయ అధికారి ఎస్ సరోజినీదేవి, ఏఈవో బాలరాజు పాల్గొన్నారు.

పరవాడ: ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం రైతులకు ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, రవిప్రసాద్ సూచించారు. పరవాడలోని శ్రీలక్ష్మీసాయి ఏజెన్సీస్, రాణార్ సూపర్ పాస్ఫెట్ తయారీ కేంద్రాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలు తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాల వారీగా టీంలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. దుకాణాల వద్ద ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరవాడ మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు దిగితే సహించేది లేదు


ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరికీ పార్టీ అండగా నిలుస్తోందని భరోసా కల్పించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటమి ప్రభుత్వ వ్యతిరేక ఓటమి కాదని ప్రజలు మార్పు కోరుకోవడం వల్లే అని చెప్పారు. కార్యకర్తలు ధైర్యం కోల్పోవద్దని ప్రతి ఒక్కరూ నిగ్రహంగా రాజకీయం చేయాలన్న ఉద్దేశంతోనే భరోసా కల్పించడానికే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మనకు మంచి రోజులు వస్తాయన్నారు. కార్యకర్తల సమస్యలను తీర్చడానికి 24 గంటలు తాము అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పని లేదని చెప్పారు. ఎన్నికల్లో కూటమి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చే విధంగా ప్రజల తరఫున పోరాటం సాగిద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను గడపగడపకు అందజేస్తే కూటమి ప్రభుత్వం పాలనలో తప్పటడుగులు వేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. పార్టీకి అండగా నిలిచిన 40 శాతం ప్రజలకు మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేసే తప్పిదాలను నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల మాజీ అధ్యక్షుడు బొడ్డపు చిన్నారావు, నాయకులు బురద రాజు, చల్లా కనకరావు, గొర్లి గోపి, పెదిశెట్టి శేఖర్, గొర్లి ఎరుకునాయుడు, కె.సీతారామయ్య, మడక సూరిబాబు, పైల హరీష్, బండారు శ్రావణ్, తిక్కాడ సత్యనారాయణ, పల్లా గోవిందు, కన్నూరు నేస్తాలు, బండి ముత్యాలు, బత్తి అప్పారావు, కె.ఉమా, ఎం.అప్పారావు, ఒమ్మి అర్జునరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్ సమీపంలో ఫార్మా వ్యర్థాల డంప్


పెదముషిడివాడ చెరువులో విడిచిపెట్టిన ఫార్మా వ్యర్థ రసాయనాల డ్రమ్ములు


డ్రమ్ముల నుంచి నేలకొరిగిన వ్యర్థ రసాయనాలు

పరవాడ: పెదముషిడివాడ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోని ఓ చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు ఫార్మా వ్యర్థ రసాయనాలతో నిండిన డ్రమ్ములను సోమవారం వేకువ జామున డంపింగ్ చేసి చల్లగా జారుకున్నారు. డ్రమ్ముల నుంచి విపరీతమైన దుర్వాసన రావడంతో స్థానికులు భరించలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చెరువులో విడిచిపెట్టిన వ్యర్థ రసాయన డ్రమ్ముల సమాచారాన్ని స్థానికులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులకు సమాచారమిచ్చారు. వ్యర్థ రసాయనాలను ఎక్కడపడితే అక్కడ విడిచిపెట్టడడం వల్ల భూగర్భ జలాలు కలుషితం కావడమే కాకుండా వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులో డంపింగ్ చేసిన డ్రమ్ములపై పరవాడ, అచ్యుతాపురం ఫార్మా కంపెనీలకు సంబంధించిన లేబుళ్లు ఉన్నాయని చెబుతున్నారు. చెరువులో వ్యర్థ రసాయనాల డ్రమ్ములు విడిచిపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

త్వరితగతిన పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ హైమావతి ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించారు. సకాలంలో స్పందించాలని ఆదేశించారు. జోన్–8 పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై మూడు వినతులు

సబ్బవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో మూడు ఫిర్యాదులు వచ్చినట్టు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలో అసైండ్ భూమి అన్యాక్రాంతంపై గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేశారు. టెక్కలిపాలెం గ్రామంలో గైరమ్మ చెరువు ఆక్రమణకు గురై చెరువు విస్తీర్ణం తగ్గిపోయిందని పేర్కొన్నారు. నల్లరేగులపాలెంలో కోరుకొండ నాయుడు అనే వ్యక్తి పూర్వీకుల నుంచి సాగులో ఉన్న తమ భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు.సర్వే నెంబర్ 10–1లో 1.53 ఎకరాల భూమిని తమ గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు.

క్లాప్ ఆటో లోడర్ల ఆందోళన

గాజువాక: పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్‌కు చెందిన క్లాప్ ఆటో లోడర్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం పక్కన గల యార్డులో ఆటోలను నిలిపివేసి నిరసన చేపట్టారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా నడుస్తాయో అధికారులు ఆలోచించాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని కోరారు. కాగా, ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు కార్మికులతో మాట్లాడారు. కార్మికుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్‌ను ఆందోళనకారుల వద్దకు పిలిపించి మాట్లాడారు. జీతాలు వెంటనే చెల్లించకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు.

నడిరోడ్డుపై యువకుడు హల్‌చల్


బీఆర్‌టీఎస్ రోడ్డులో హల్ చేసిన యువకుడి చుట్టూ గుమిగూడిన వాహనదారులు

సింహాచలం: వేపగుంట నుంచి సింహాచలం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డుపై సింహపురిలేఅవుట్ ఆర్చి వద్ద సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఒక యువకుడు హల్‌చల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వారిని ఇష్టానుసారం బూతులు తిట్టడం, అదేమిటని అడిగినవాళ్లపై దాడిగి దిగాడు. దీంతో వాహనదారులు, స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ యువకుడిని పట్టుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులను కూడా ఆ యువకుడు ఇష్టానుసారం తిట్టాడు. ఆ యువకుడు పేరు లక్ష్మణ్ (22) అని, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు.పోలీసులు అతన్ని పెందుర్తి పోలీసు స్టేషన్‌కి తరలించి బైండోవర్ చేశారు.

అతిసార వ్యాధి నివారణకు చర్యలు


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ శానాపతి వసంత

పెందుర్తి: అతిసార వ్యాధి నిరోధానికి సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ శానాపతి వసంత అన్నారు. అతిసార వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా జీవీఎంసీ 97వ వార్డులోని చినముషిడివాడ ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన, వేడి ఆహార పదార్థాలు, వేడి నీరు తాగాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాలని చెప్పారు.